
ప్రజాశక్తి
శుక్రవారం 5 డిసెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం



మొక్కజొన్న రైతులకు వ్యాపారి కుచ్చుటోపీ

సాలూరు : సాలూరు, పాచిపెంట మండలాల్లో పలువురు రైతుల నుంచి మొక్కజొన్న గింజలు కొనుగోలు చేసిన వ్యాపారి వారికి కుచ్చుటోపీ పెట్టిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొద్ది రోజుల క్రితం రైతులు మొక్కజొన్న విక్రయించిన డబ్బులు వ్యాపారి ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యాపారి పులగం వీర వెంకటరెడ్డి నమ్మకంగా గత కొంతకాలంగా రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే నమ్మకంతో వ్యాపారికి రైతులు అరువుపై మొక్కజొన్న విక్రయించారు. నెలలు దాటినా వ్యాపారి కనిపించకపోవడంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదంతా తెలుసుకున్న వ్యాపారి రైతులకు ఐపి నోటీసులు జారీ చేశారు. రైతులకు సుమారు 50లక్షల రూపాయల పైనే చెల్లించాల్సి వుండగా తన వద్ద 42 వేల రూపాయల విలువైన ఆస్తి వున్నట్లు చూపించారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఒక్కో రైతుకి రూ.20వేల నుంచి రూ.2.7లక్షల వరకు వ్యాపారి బకాయి వున్నట్లు తెలుస్తోంది.

వెంటాడుతున్న గిరిజన విద్యార్థుల మరణాలు



భామినిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన కొండబోయగెడ్డ రిజర్వాయర్

- రెండేళ్లవుతున్నా అమలుకాని ఎఎన్ఎంల నియామకం
- సంక్షోభంలో ఐటిడిఎలు
- రెగ్యులర్ పిఒలు లేక పరిష్కారం కాని సమస్యలు
- అందని ద్రాక్షలా పారిశ్రామిక అభివృద్ధి
- ముందుకు సాగని ఇరిగేషన్ ప్రాజెక్టులు
- సిఎం పర్యటనతో సమస్యలు పరిష్కారమయ్యేనా?

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో గల పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ లు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ఊపు కనిపించడం లేదు. గతంతో పోల్చుకుంటే ఐటిడిఎలు అచేతనంగా కనిపిస్తున్నాయి. గడచిన ఐదేళ్లుగా పాలకవర్గ సమావేశాలు నిర్వహించలేని దుస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయి. గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రధాన వేదికలైన పాలకవర్గ సమావేశాలు నిర్వహించడానికి ముందుకు రాని పరిస్థితి కనిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గిరిజన సంక్షేమం, అభివృద్ధికి బడ్జెట్లో కేటాయించిన నిధులు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఫలితంగా ఐటిడిఎలు ఉత్సవ విగ్రహాలను తలపిస్తున్నాయి.

రెగ్యులర్ పిఒల్లేక పరిష్కారం కాని సమస్యలు

జిల్లాలోని సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎలకు రెగ్యులర్ ప్రాజెక్టు అధికారులు లేక గిరిజన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఏళ్ల తరబడి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలాయి. విద్య, వైద్యం, తాగునీటి సరఫరా, రహదారి సమస్యలను పట్టించుకోవడం లేదు. కాగితాలపై నిధులు మంజూరు చేస్తున్నా ఆచరణలో అమలు కావడం లేదు. దీంతో గిరిజనులు గ్రీవెన్స్ సెల్‌ల్లో వినతులు అందజేసినా ఫలితం కనిపించడం లేదు. గత రెండేళ్లుగా ఐటిడిఎ లకు రెగ్యులర్ ప్రాజెక్టు అధికారులు లేకపోవడం తో గిరిజన సమస్యలపై దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంది. సబ్ కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్లను ఐటిడిఎ పిఒలుగా అదనపు బాధ్యతలతో ప్రభుత్వం నియమించింది. దీనివల్ల రెవెన్యూ సమస్యల పరిష్కారంపైనే ఆ అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఐటిడిఎల వైపు ఇంఛార్జి పిఒలు చుట్టం చూపుగా వచ్చి వెళ్ళిపోతున్నారు. పాలకవర్గ సమావేశాలు కూడా నిర్వహించలేని పరిస్థితి కనిపిస్తోంది.

వెంటాడుతున్న విద్యార్థుల మరణాలు

ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులను మరణాలు ఏటా వెంటాడుతూనే ఉన్నాయి. మరణాల నివారణకు శాశ్వత చర్యలు తీసుకునే స్థితిలో ఐటిడిఎలు లేవు. ప్రతిఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు వివిధ అనారోగ్య కారణాలతో మరణిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 20మందికి పైగా విద్యార్థులు మృత్యువాత పడ్డారు. కురుపాం గురుకుల పాఠశాలలో పచ్చకామెర్లతో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందడం, మరో 200 మంది అస్వస్థతకు గురికావడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనానికి దారి తీసింది. రక్షిత మంచినీటి సరఫరా చేసే వాటర్ ప్లాంట్లు మరమ్మతు కావడంతో అవి పని చేయడం లేదు. అలాగే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవడం కూడా పెద్ద సమస్యగా తయారైంది.

రెండేళ్లవుతున్నా నియామకం కాని ఎఎన్ఎంలు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఎఎన్ఎంలు నియమిస్తామని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రకటించింది. దీనికి సంబంధించిన ఫైలుపై గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి తొలి సంతకం చేసి రెండేళ్లు కావస్తోంది. ఇంతవరకు అది అమలు చేయడం లేదు. పోషకాహార లోపంతో పాటు అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించేందుకు ఎఎన్ఎంల నియామకం చాలా అవసరం ఉంది. కానీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

అందని ద్రాక్షలా పారిశ్రామిక అభివృద్ధి

జిల్లా ఏర్పడి నాలుగేళ్లు కావస్తోంది. పారిశ్రామిక అభివృద్ధి అందని ద్రాక్ష లా మిగిలింది. జిల్లాలో ఉన్న రెండు ప్రధాన పరిశ్రమలు మూతపడ్డంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. సీతానగరం మండలం లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని ఎన్నికల ముందు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఆయన గెలుపు కోసం ప్రచారం చేసిన టిడిపి అగ్రనేతలు కూడా హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తోంది. షుగర్ ఫ్యాక్టరీని తెరిపించే చర్యలేవీ కనిపించడం లేదు. సాలూరులో ఉన్న జీగిరాం జూట్ మిల్లు మూతపడి నాలుగేళ్లు కావస్తోంది. రెండు వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. అధికారంలోకి వస్తే మిల్లు తెరిపిస్తామని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సంధ్యారాణి, యువనేత లోకేష్ హామీ ఇచ్చారు. ఇంతవరకు మిల్లు తెరిపించేందుకు ప్రయత్నం చేయడం లేదు. ఫలితంగా కార్మికులు ఉపాధి కూలీలు గా మారిపోయారు.

ముందుకు సాగని ఇరిగేషన్ ప్రాజెక్టులు

మన్యం జిల్లా వ్యవసాయ ప్రధానమైన ప్రాంతం. 70 శాతం మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. పాలక పార్టీల నిర్లక్ష్యంతో అనేక సాగునీటి ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల ముందు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యేలు ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం గురించి ఊసెత్తని పరిస్థితి. తోటపల్లి ఎడమ కాలువల ఆధునికీకరణ, జంఝావతి, పెద్దగెడ్డ కుడి కాలువ నిర్మాణంతో పాటు అనేక చిన్న చిన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. జిల్లాలో అనేక జీవనదులు ఏడాది పొడవునా ప్రవహిస్తున్నాయి. ఈ వనరులతో మినీ రిజర్వాయర్లు నిర్మిస్తే మన్యం జిల్లా వ్యవసాయ రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించవచ్చు. కురుపాం నియోజకవర్గంలోని గుమ్మిడి గెడ్డ రిజర్వాయర్ దీర్ఘకాలంగా పెండింగ్‌లో వుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణమనేది ఐదేళ్ల కోసారి ఎన్నికల సమయంలో పాలక పార్టీలు హామీల కోసం వాడుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది.



పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయం

కొండలోయగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయ్యేనా?

భామిని : మన్యం జిల్లాలోని చిట్ట చివరి మండలం, ఆంధ్రా - ఒడిస్సా సరిహద్దు మండలం అయినా భామిని అన్నింటా వెనుకబడి ఉంది. మండలంలో వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాలనే ఉద్దేశంతో భామిని ఎగువన భూమిని సేకరించి పొందు పాములు గెడ్డ, కొండలోయగెడ్డ, కొత్త చెరువు గెడ్డను కలిపి 2006లో జలయజ్ఞం కార్యక్రమంలో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. 30 అడుగు మేర లోతుగా తవ్వి కాంక్రీటు పనులు చేపట్టి, 3 గెడ్డలను కలుపుతూ అడ్డుకట్ట నిర్మించారు. అయితే పలు కారణాల రీత్యా పనులను అర్ధాంతారంగా నిలిపివేశారు. దీంతో వర్షం పైనే ఆధారం పడాల్సిన పరిస్థితి. రిజర్వాయర్ నిర్మించాలని పలుమార్లు పాలకులు విన్నవించినా ఫలితం లేకపోయింది. అలాగే భామినిలో డిగ్రీ కాలేజీ, ఐటిఐ, మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని మండలా వాసులు కోరుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న కొరమ వంతెనకు నిధులు కేటాయించి వారధి నిర్మించాలని మండలి వాసులు కోరుతున్నారు. కోసలి, కీసర వంశధార వరద ముంపుకు గురవుతున్నాయి. వంశధార నది వెంబడి కరకట్టలు నిర్మాణం చేపట్టాలని మండలం వాసులు ఆశిస్తున్నారు. ఈ సిఎం రాకతోనైనా పరిష్కారమవుతాయోమనని మండల ప్రజలు గంపెడాశతో ఉన్నారు. వీరి ఆశలను అమాత్యులు ఏ మేరకు నెరవేర్చు వరాల జల్లు కురిపిస్తారో వేచి చూడాల్సిందే.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమయ్యేనా?

గుమ్మలక్ష్మీపురం : మన్యం జిల్లా పర్యటనకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఏజెన్సీ ప్రాంతంలో దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలను పరిష్కరించాలంటూ గిరిజనులు వేడుకుంటున్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి గిరిజనులకు ఉపాధి కల్పించాలని, వలసలు నివారించాలని, వైటిసి లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని వేడుకుంటున్నారు. గుమ్మలక్ష్మీపురం కేంద్రంలో డైట్ కళాశాల ఏర్పాటు చేసి గిరిజన అభ్యర్థులకు ఉపాధ్యాయ శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సిఎం సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

సిఎం రాకకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి -భామిని

స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని అనే విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం నిర్వహణ రాష్ట్ర, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు ఏర్పాటు సర్వం సిద్ధం చేశారు. ఆదర్శ పాఠశాల పరిసరాలు, హెలిపాడ్ ప్రాంతం సిఎం పాల్గొనే సభా ప్రాంగణం పూర్తి స్థాయిలో సెక్యూరిటీ సిబ్బంది అధీనంలో ఉంది. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు.

భద్రత ఏర్పాట్లు పరిశీలించిన డిఐజి

మండలంలోని ఎపి మోడల్ స్కూల్ వేదికగా జరిగే మెగా పేరెంట్ - టీచర్స్ మీటింగ్ హాజరుకానున్న నేపథ్యంలో సిఎం చంద్రబాబు పర్యటనా ఏర్పాట్లను, సభాస్థలాన్ని, భద్రతా ఏర్పాట్లను విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డితో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి హెలికాప్టరు దిగేందుకు ప్రత్యేకంగా నిర్మించిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని, అక్కడ ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లును, కాన్వాయ్‌కు సంబంధించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రసంగించే ప్రజావేదిక, ప్రజలు లోపలికి వచ్చే/పోయే మార్గాలు, వివిఐపి, విఐపి వాహనాల పార్కింగ్ స్థలాల వద్ద బందోబస్తు, ట్రాఫిక్ తదితర అంశాల్లో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రాష్ట్ర విద్యా శాఖ నారా లోకేష్ భామిని లో ఏర్పాటు చేయబోయే కార్యకర్తల సమావేశ ప్రాంగణ స్థలిని, భద్రతా ఏర్పాట్లను డిఐజి, ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎస్పీ మనీషా వంగలరెడ్డి, ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, పాలకొండ డిఎస్పీ రాంబాబు, సిఐ ప్రసాద్ రావు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉదయం 10.30గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణకు చేరుకుంటారు.

- 10.30 నుంచి 10.50 వరకు మంత్రి లోకేష్‌తో కలసి అ క్షరాస్యత కార్యక్రమంపై సంభాషిస్తారు.
- 10.50 నుంచి 11.10 వరకు స్పోర్ట్స్ రూమ్, స్కిల్ ల్యాబ్, బయోలజి పరిశీలన
- 11.15 నుంచి 11.30 విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం
- 11.30 నుంచి 11.45 క్లాస్ రూమ్ టీచింగ్, అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో గ్రూప్ ఫొటో
- 11.50 నుంచి ప్రజావేదిక వద్ద సమావేశం.
- 12.10గంటలకు పేరెంట్స్, ఎస్ఎంసి ప్రసంగం
- 12.20 నుంచి 12.40 వరకు విద్యాశాఖామంత్రి లోకేష్ ప్రసంగం
- 12.45 నుంచి 1.25 వరకు ముఖ్యమంత్రి ప్రసంగం
- 1.25 నుంచి 1.55 వరకు విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం
- 2గంటలకు తిరుగు ప్రయాణం



కళింగాంధ్ర నాటకంపై మాట్లాడుతున్న కవి, రచయిత వాసుదేవరావు

సాహితీ కార్యక్రమాలకు విశేష స్పందన

అలరించిన రైతన్న లఘునాటిక

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ నెల 25 నుంచి ప్రారంభమైన మన్యం పుస్తక మహోత్సవంలో భాగంగా గడిచిన తొమ్మిది రోజులుగా నిర్వహించిన సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. గురువారం జుట్టు సంస్థ నిర్వాహకులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన నిర్వహించిన సాహిత్య సభలో వక్తలు మాట్లాడారు. తూర్పు కొండల్లో మెరిసిన మేరంగి అనే నవలను రచయిత పల్లా రోహిణి కుమార్ పరిచయం చేశారు. కళింగాంధ్ర నాటకంపై కవి, రచయిత రౌతు వాసుదేవరావు మాట్లాడారు. అనంతరం కొండపల్లి గౌరు నాయుడు దర్శకత్వంలో రైతన్న లఘునాటికను ప్రదర్శించారు. అంతకు ముందు జట్టు సభ్యులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత మార్క్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధి కిరణ్ కుమార్ వ్యాసరచన పోటీలు నిర్వహించారు.



కమిషనర్‌తో చర్చిస్తున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు

కార్మికుల జీతాలు చెల్లించకుంటే పోరాటం

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపాల్టీలో నిధుల్లేవనే కారణంతో సక్రమంగా సమయానికి జీతాలు చెల్లించడం లేదని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు వెల్లడించారు. కార్మికుల సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌తో చర్చించిన అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, యూనియన్ సాలూరు అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారి రవి, శంకర్రావు, రాముడు మాట్లాడారు. ప్రభుత్వం ప్రతినెలా కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు చెల్లించాకే పర్మినెంట్ ఉద్యోగులు జీతాలు చెల్లించాలని ఆదేశాలున్నా వాటిని కమిషనర్, అధికారులు పక్కన పెట్టారన్నారు. కార్మికుల జీతాలకు ప్రతినెలా ఎదురుచూడాల్సిన పరిస్థితిని ప్రభుత్వం అధికారులు కల్పించాలని దీంతో కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రస్తుతం 29 వార్డుల్లో ఎక్కువ భాగం డస్ట్ బిన్నులు, చెత్తబుట్టలు, పుస్కాట్లు 90 శాతం పాడైపోయాయని, కార్మికుల డబ్బులతో కొంతమంది రిపేర్లు చేయించుకుని పనికి ఆటంకం లేకుండా చేసుకుంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితి మారాలంటే మున్సిపాలిటీకి నిధులు లేకుండా సాధ్యం కాదని తెలిపారు. ఇప్పటికే కాంట్రాక్ట్ కార్మికులు సబ్బులు, నూనెలు, చెప్పులు ఇవ్వాల్సి ఉన్నా నిధుల్లేవనే కారణంతో ఇవ్వడం లేదని తెలిపారు. చనిపోయిన కార్మిక కుటుంబాలకు రావాల్సిన నష్ట పరిహారం ఏళ్లు గడుస్తున్నా నేటికీ చెల్లించలేదని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ కలుగజేసుకొని పై సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 15 తర్వాత కార్మికులు చేసే ఆందోళనకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధికి ఎసరు

- 1.9లక్షల జాబ్‌కార్డులు తొలగింపు
- ఇకెవైసి పేరిట కిరికిరి
- అత్యధికంగా సంతకవిటి, బొబ్బిలి, దత్తిరాజేరు మండలాల్లో..
- నిధుల తగ్గించేందుకు సర్కారు కుతంత్రం

జిల్లాలో లక్షా 9వేల ఉపాధి కార్డుల తొలగింపునకు ప్రభుత్వం కసరత్తు చేసింది. వీరికి ఇక నుంచి అడిగిన వెంటనే పని కల్పించే పరిస్థితి ఉండబోదు. మస్తర్లలో పారదర్శకత పేరుతో ఇకెవైసి అనుసంధానం చేయడంతో ఉపాధి కూలీలపై తీవ్ర ప్రభావం పడనుంది. గడిచిన పదేళ్లగా ఏటా ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం నిధులు కోత విధిస్తున్న సంగతి విధితమే. దీన్ని మరింత తగ్గించేందుకు వీలుగా ఈసారి ఏకంగా జాబ్‌కార్డులనే తగ్గించే దిశగా చర్యలు చేపట్టింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో 6లక్షల 23వేల 471 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరందరికీ ఇకెవైసి చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో, ఇప్పటి వరకు కేవలం 5,14 465 జాబ్‌కార్డుదారుల ఇకెవైసి చేయించుకున్నారు. మిగిలిన 1,09,006 మంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇకెవైసి చేయించుకోలేదు. వీరు కోరిన వెంటనే పని కల్పించే అవకాశం ఉండబోదని, తిరిగి ఇకెవైసి చేయించుకుంటే పునరుద్ధరణ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఉపాధి హామీ చట్టం ప్రకారం ఏడాదికి వంద రోజులు పనిదినాలు మాత్రమే ప్రభుత్వం కల్పిస్తోంది. దీన్ని 200రోజులకు పెంచాలని ఉపాధి కూలీలు, వారి తరుపున వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో పనిదినాలను పెంచాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా ఏడాదిలో 265 రోజులపాటు కూలీలు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో చాలా మంది ఏడాదిలో కొన్ని రోజులు ఉభయగోదావరి జిల్లాల్లోని వ్యవసాయ పనులకు, విశాఖ, హైదరాబాద్, చెన్నైయ్ వంటి మహానగరాల్లో భవన నిర్మాణ పనులకు వలసపోతున్న సంగతి విధితమే. ఈనేపథ్యంలో జిల్లాపై వలసకార్మికుల జిల్లా అనే పేరు కూడా నానుడిగా ఉంటోంది. ఇలా వలస వెళ్లినవారే ఆ లక్షా 9వేల మంది కూలీలు. వీరంతా ఉపాధి పనులు వినియోగించుకోగా మిగిలిన సమయంలో ఖాళీగా ఉండలేక వివిధ ప్రాంతాలకు వలసపోతూ ఉంటారు. ఇటువంటి పరిస్థితుల్లో జాబ్‌కార్డుల కోత అంటే నిజమైన వలసకూలీల పొట్టకొట్టడమేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 8మండలాల్లో ఐదువేలకుపైగా జాబ్ కార్డులు తొలగించారు. ఇదేమంటే ఇది తొలగింపు కాదని, ఇకెవైసి నమోదు కాకపోవడం వల్ల హోల్డ్‌లో మాత్రమే పెట్టామని చెబుతున్నప్పటికీ, వారు వివిధ వలస ప్రాంతాల నుంచి వచ్చి అడిగిన వెంటనే పని కల్పించే పరిస్థితి ఉండే పరిస్థితి లేదు. ఇలా వచ్చినవారు ఇకెవైసి కోసం ఎన్ని తిప్పలు పడాల్సివుంటోందని చెప్పనవసరం లేదు. జిల్లాలో అత్యధికంగా సంతకవిటి మండలంలో 6,915కార్డులు తొలగించారు. బొబ్బిలిలో 5,821, దత్తిరాజేరులో 5,759, రామభద్రపురంలో 5,655, తెర్లాంలో 5,520, వంగరలో 5,320, రేగిడి ఆమదాలవలసలో 5,267, మెరకముడిదాం మండలంలో 5,118 చొప్పున జాబ్‌కార్డులు తొలగించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

బాధిత మహిళకు ఐద్వా అండ

ప్రజాశక్తి - సాలూరు



బాధిత మహిళను కలిసిన ఐద్వా నాయకులు

వ ట్ట ణా ని కి చెందిన ఒంటరి మహిళను వేధింపులకు గురి చేసిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుమారుడు, వ్యక్తిగత సిబ్బందిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.శ్రీదేవి, బి.లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు మేరకు గురువారం సాలూరులోని బాధిత మహిళ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల రోజురోజుకు వేధింపులు పెరుగుతున్నాయని, శారీరక, మానసిక, డిజిటల్ వేధింపులకు వ్యతిరేకంగా మహిళలు ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అలాంటి బాధిత మహిళలకు ఐద్వా అండగా ఉంటుందన్నారు. సనాతన కాలం నాటి వెనుక బాటు తనం విడనాడి మహిళలు తమ సమస్యలపై పోరాడాలని, బాధిత మహిళలు ఐద్వా మహిళా సంఘాన్ని ఆశ్రయించవచ్చునని, ఐద్వా ఎల్లప్పుడూ మహిళలకు రక్షణగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఉపాధ్యక్షులు ఎం గౌరమ్మ పాల్గొన్నారు.

కార్యకర్తలే సుప్రీం : మంత్రి లోకేష్

ప్రజాశక్తి - భామిని



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖా మంత్రి లోకేష్

పార్టీ కి కార్యకర్తలే సుప్రీమని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. భామిని లోని లివిరి కూడలిలో ప్రత్యేక ప్రాంగణంలో భవనంలో టిడిపి కార్యకర్తల సమావేశంలో గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మరో 15ఏళ్ల వరకూ కలిసే ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వంలో కార్యకర్తలకే తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. చిన్న చిన్న సమస్యలపై సర్దుకుపోవాలన్నారు. కూటమి ప్రభుత్వం బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కె.అచ్చెన్నాయుడు, జి.సంధ్యారాణి, స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి, జిసిసి అధ్యక్షులు కిడారి శ్రామణకుమార్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టిడిపి నాయకులు ఎం.తేజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం : భామినికి వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం రాత్రి స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు ఉన్నారు.

సీతంపేటలో...

సీతంపేట: గురువారం రాత్రి భామిని కార్యకర్తలతో సమావేశంలో భాగంగా ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సీతంపేట మీదుగా వాహనం వెళ్లడంతో సాయంత్రం కొద్దిసేపు కాన్వయ్ ఆపి కార్యకర్తలకు, ప్రజలకు అభివాదం తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి, జయలక్ష్మి, రాజబాబు తదితరులు ఉన్నారు.



లక్ష్మయ్య స్థూపానికి నివాళ్లు అర్పిస్తున్న గిరిజనులు

లక్ష్మయ్య ఆశయాలను కొనసాగిద్దాం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సిపిఎం సీనియర్ నాయకులు, ఆదివాసీ గిరిజన సంఘం సభ్యులు కొండగొర్రి లక్ష్మయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ఉద్యమిస్తూ ఆయన ఆశయాలను కొనసాగించాలని సిపిఎం సీనియర్ నాయకులు కె.గౌరీశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కుక్కిడి పంచాయతీ కె.శివడలో లక్ష్మయ్య 14వ వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థూపం వద్ద నివాళులు అర్పించారు. గిరిజన హక్కులు, చట్టాల కోసం లక్ష్మయ్య నిరంతరం పోరాటం సాగించారని గుర్తు చేశారు. ప్రభుత్వ విధానాలపై పోరాడే క్రమంలో ప్రజల కోసం ఏడేళ్ల జైలు జీవితం అనుభవించారని తెలిపారు. నాటి తరం పోరాటాల్లో కొనసాగింపుగానే లక్ష్మయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఎంతైనా ఉందన్నారు. గిరిజన సంఘం నాయకులు శంకరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంత హక్కులు, సమస్యలపై ఆదివాసీ గిరిజన సంఘం నిరంతరం పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు కె.లక్ష్మి, లక్ష్మయ్య కుటుంబ సభ్యులు కొండగొర్రి భాస్కరరావు, గిరిజన సంఘం నాయకులు బిడ్డిక ప్రకాష్, అప్పారావు, మిన్నారావు, గ్రామకమిటీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి- సీతంపేట

భామిని మండలంలోని ఎపి మోడల్ స్కూల్ వద్ద నిర్వహించనున్న మెగా పిటిఎం సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతున్న కారణంగా ప్రతి శుక్రవారం సీతంపేట ఐటిడిఎలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఈ శుక్రవారం రద్దు చేస్తున్నట్లు ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గిరిజన ప్రజలు గమనించి వినతులు ఇవ్వడానికి ఐటిడిఎకు రావద్దని కోరారు.

కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - సాలూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్‌గా జరజాపు దిలీప్ గురువారం విజయవాడ బీసీ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక సెల్‌ఫోన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన కులాలకు అత్యున్నత గౌరవం ఇవ్వాలని, అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించిన కూటమి ప్రభుత్వం అన్ని ప్రాంతాల నుండి సమన్యాయం చేయటానికి ఇటువంటి పదవులను అందజేసిందన్నారు. ఇందుకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయన తెలిపారు. అనంతరం మంగళగిరిలో ఉన్న జనసేన కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్‌ను సాలూరు మాజీ మున్సిపల్ చైర్మన్ జరజాపు ఈశ్వరరావు, జిల్లా జనసేన నాయకులు జరజాపు సూరిబాబు, అవనాపు విక్రం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్యేకు వినతి పత్రాన్నిస్తున్న గిరజనేతరులు

శాశ్వత గృహాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల ఏజెన్సీ ప్రాంతాలలో నివాసముంటున్న గిరిజనేతరులకు శాశ్వత గృహాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి గురువారం గిరిజనేతరులు వినతి అందజేశారు. ఈ మేరకు టిడిపి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి అటవీ హక్కుల చట్టం ప్రకారం 1950కు పూర్వం ఉంటున్న గిరిజనేతరులకు ఈ చట్టాన్ని అమలు చేయాలని, 1/70 చట్టం అమలులో భాగంగా భూములు కోల్పోయిన వారికి నివాస స్థలాలు, గృహాలు మంజూరు చేయాలని కోరారు.

దశమంతపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, జ్వర పీడితులు, బాలింతలు, మధుమేహ, రక్తపోటు, చిన్నారులు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శుభారాతమని, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

69మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు జాక్సన్ 69 మందికి కంటి పరీక్షలు చేసి 36 మందిని నేత్ర చికిత్సలకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, డాక్టర్ పావని, వైద్య సిబ్బంది, శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ సిహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

సిఎంకు సిపిఎం బహిరంగ లేఖ

ప్రజాశక్తి - పాలకొండ

నియోజకవర్గ పరిధిలో గల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సిపిఎం నాయకులు బహిరంగ లేఖ రాశారు. ఈ ప్రాంత అభివృద్ధిలో ప్రభుత్వాలు తగినంత శ్రద్ధ చూపకపోవడంతో వెనకబడి ఉందన్నారు తోటపల్లి ఆధునీకరణ పనులు చేపట్టి ఈ ప్రాంత రైతాంగానికి దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. మూడు దశాబ్దాలు పూర్తికాని జంపరకోట రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. పాలకొండ పట్టణ రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించాలన్నారు. వీరఘట్టంలోని 50 పడకల ఆసుపత్రిని వెంటనే పూర్తి చేయాలన్నారు. సీతంపేట సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని వెంటనే పూర్తి చేయాలన్నారు. భామిని మండలానికి జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భామిని మండలంలో వంశధార వరద ముంపు ప్రాంతాల్లో రక్షణ గోడ నిర్మించాలన్నారు. వడ్డంగి వద్ద ఎత్తుపోతుల పథకం పెట్టి 3వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నారు. గిరిజన బాలి బాలికలు మరణాలు నివారించేందుకు వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. లేఖ రాసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంతిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు దావాల రమణారావు, ఆరిక భాస్కరరావు, కె.మిన్నారావు ఉన్నారు

పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో ఉన్న ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు ఎస్టీ కమిషన్ మెంబర్ కద్రక మల్లేశ్వరరావు వినతి అందించారు. గుమ్మలక్ష్మీపురంలోని కుశా పార్కు, కొమరాడ మండలం గుంప దేవస్థానం, జాకూరు వ్యూ పాయింట్, తెగలపాడు, జొప్పంగి, జంఝావతి రబ్బర్ డాంను పర్యాటక హబ్‌లుగా తీర్చిదిద్దే అంశంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మల్లేశ్వరరావు తెలిపారు.


వినతి పత్రాన్నిస్తున్న కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న అన్ని విభాగాల కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తమ వంతుగా సిఎంకు లేఖ రాసి సహకరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ కె.కిశోర్‌కుమార్‌కు యూనియన్ నాయకులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను, ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణం వేతనాలు, పిఆర్‌సి, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, పరిమిత వరదరాజు, మామిడి శివ తదితరులు పాల్గొన్నారు.

అధిక కరెంట్ బిల్లులను రద్దుచేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాలతో పాటు మైదాన ప్రాంతాల్లో గిరిజనులకు అధికంగా వస్తున్న కరెంట్ బిల్లులను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వాకాడ ఇందిరా డిమాండ్ చేశారు. అధికంగా వస్తున్న బిల్లులు తగ్గించాలని కోరుతూ కొమరాడ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులతో కలిసి గురువారం నిరసన తెలిపారు. అనంతరం ఎలక్ట్రికల్ ఎఇ రమణ, తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని నయా పంచాయతీ పరిధిలోని నయాలంక, వనకాబడి, సంకేసు, గుణ్ణం గ్రామాలతో పాటు మరికొన్ని గిరిజన గ్రామాలకు రూ.2వేల నుంచి సుమారు రూ.22 వేల వరకు కరెంటు బిల్లు రావడంతో గిరిజన ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ మొత్తం బిల్లులను కట్టకపోతే మీటర్లు తొలగిస్తామని సిబ్బంది గత మూడు రోజులుగా గిరిజన గ్రామాలకు వెళ్లి బెదిరించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని ఇప్పుడు దాక వచ్చిన బిల్లులన్నీ రద్దుచేసి ఇక నుండి కొత్త బిల్లులు కట్టించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, తొమ్మిది గ్రామాలకు సంబంధించిన గిరిజన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న గిరిజనులు

పెంచలయ్య హంతకులను శిక్షించాలి

పెంచలయ్యను హత్య చేసిన దుండగులను శిక్షించాలని, ఆయన కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వాకాడ ఇందిరా డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తితో కలిసి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో గంజాయి మాదకద్రవ్యాల వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందని పోలీసులు వాటిపై చర్యలు తీసుకోవడంలో వెనుకబడటంతో పెంచలయ్య తాను నివసిస్తున్న కాలనీలో గంజాయికి వ్యతిరేకంగా యువతను చైతన్యం చేశారని గుర్తు చేశారు. దీంతో ఆయనను గంజాయి మాఫియా అతి కిరాతకంగా హత్య చేసిందని ఈ దురాగతానికి పాల్పడిన వారిని ప్రోత్సహించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో గిరిజనులు రామారావు, వెంకటేష్, సుబ్బారావు, వెంకన్న, శోభన, శ్రీను, మాధవ్ పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి : మంత్రి

ప్రజాశక్తి- పాలకొండ

సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కోరారు. గురువారం స్థానిక సిటీ నాయుడు కల్యాణమండపంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. గిరిజన విద్యార్థులు చనిపోవడాన్ని జగన్మోహన్ రెడ్డి రాజకీయం చేస్తున్నారని, ఆయన హయాంలో 2023లో 63 మంది విద్యార్థులు చనిపోయారని అన్నారు. తన పిఎపై వచ్చిన ఆరోపణపై కేసు కూడా నమోదైందన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యం లేదన్నారు. చంద్రబాబు వస్తే విపత్తులు వస్తాయని వైసిపి నేతలు అనడం విడ్డూరంగా ఉందన్నారు. కరోనా కంటే విపత్తు కాదని, అది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే వచ్చిందన్నారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, వైస్ ఎంపిపి వాకముడి అనిల్, జాడ శ్రీధర్, పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్ ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించకుంటే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

నగరంలో నిషేధిత ప్లాస్టిక్ సామగ్రిని విక్రయించడం గాని, వినియోగించడంగాని చేపట్టరాదని, ప్లాసిక్ట్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో గురువారం సర్కిల్ వారీగా ఆయా పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు టీములుగా ఏర్పడి వివిధ దుకాణాలపై దాడులు చేపట్టారు. టిఫిన్ దుకాణాలు, జ్యూస్ దుకాణాలు, పళ్ళ దుకాణాలు లలో దాడులు చేపట్టి ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు వంటి నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు చిరు వ్యాపారులలో ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. మళ్లీ పునరావృతమైతే చర్యలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు.

పారిశుధ్య పనులు పరిశీలన

నగరంలో పలు ప్రాంతాల్లో కమిషనర్ పల్లి నల్లనయ్య పర్యటించి స్థానికుల నుండి పలు వివరాలను సేకరించారు. తడి చెత్త పొడి చెత్త అందిస్తున్న తీరు, రెండు బుట్టల విధానం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. 56వ నెంబరు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్న క్యాంటీన్ పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, స్వచ్ఛ సచివాలయంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అనంతరం అన్న క్యాంటీన్ ను సందర్శించారు.

మన వీధి.. మన బాధ్యత

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

మన వీధిని మనం శుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మున్సిపల్ కమిషనర్ కిశోర్ కుమార్ అన్నారు. పట్టణంలోని రెండో వార్డు కొత్త వీధిలో ప్రజారోగ్య విభాగ అధికారులు, సచివాలయాల శానిటరీ కార్యదర్శితో కలిసి గురువారం మన వీధి - మన బాధ్యత కార్యక్రమం ర్యాలీని నిర్వహించి, ఆ వార్డులోని ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, సీజన్ వ్యాధులు, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాల గూర్చి అవగాహన కల్పిస్తూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని, ప్రతిరోజూ ఇంటింటికి చెత్త సేకరణకు వచ్చే పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తలను వేరు చేసి అందించి స్వచ్ఛ పార్వతీపురం దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలతో పాటు నాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గుమ్మలక్ష్మీపురం సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు కోరారు. గుమ్మలక్ష్మీపురం స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి షాప్‌ను సందర్శించి, ప్రతి దుకాణదారికి ఒక చెత్త సేకరణ బ్యాగ్ అందజేశారు. ప్రతి రోజు ఉదయం సంబంధిత ఫీల్డ్ కోఆర్డినేటర్స్ షాపులను సందర్శించి ఆ బ్యాగులను సేకరిస్తారని తెలిపారు. సేకరించిన చెత్తను వేరు చేసి (సెగ్రిగేషన్), రీసైకిల్ చేసి, అమ్మకం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చేలా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామం మరింత శుభ్రంగా మారుతుందని సర్పంచ్ తెలిపారు. వ్యాపారవేత్తలంతా సమష్టిగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషోర్, వర్తక సంఘ అధ్యక్షులు బుడంకాయల వెంకట్రావు, కమిటీ సభ్యులు దొరబాబు, వెంకీ, మన్మథ, సాయి నాని, వైశ్య సంఘ అధ్యక్షులు హరి మాస్టారు, మాజీ సర్పంచ్ పాలక ప్రేమానంద్, శబరిమాత స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ బి. సూర్యం, ఫీల్డ్ కోఆర్డినేటర్ బి. ప్రసాద్ రావు, కోఆర్డినేటర్లు, డ్రైవర్, వర్కర్లు పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం: ప్లాస్టిక్‌ను సేకరిస్తున్న సర్పంచ్ తదితరులు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి : వైసిపి

ప్రజాశక్తి - సాలూరు

రానున్న స్థానిక ఎన్నికల్లో వైసిపి సత్తా చాటాలని నియోజకవర్గ పరిశీలకులు శరగడం చిన అప్పలనాయుడు కోరారు. గురువారం మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందని చెప్పారు. వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ,వార్డు, బూతు స్థాయి కమిటీల కూర్పు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. రాజన్నదొర మాట్లాడుతూ 2029 ఎన్నికల్లో వైసిపిదే అధికారమని, నాయకులు కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరిరఘు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన సేవల కోసమే డివిజన్ కార్యాలయం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రభుత్వాలు అందిస్తున్న గ్రామీణ పథకాలు ప్రజలకు అందించడానికి, అధికారుల నుంచి మెరుగైన సేవలందడానికి ప్రతి డివిజన్లో ఒక ప్రభుత్వ శాశ్వత కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని నర్సిపురంలో కొత్తగా నిర్మించిన డివిజనల్ అభివృద్ధి వారి కార్యాలయాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లాలో ప్రతి డివిజన్‌కు ఒక ప్రభుత్వ సముదాయాన్ని ఏర్పాటు చేసి అందులో వివిధ శాఖలకు సంబంధించిన సేవలు అధికారులు అందించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు సులువు పద్ధతుల్లో అందించడానికి ఈ కార్యాలయం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యాలయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి పూర్తిస్థాయి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకటరమణ, మౌళి, గొట్టాపు వెంకట నాయుడు, చంద్రమౌళి, సారికి గణేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పాలకొండ : డిఎల్‌డిఒగా ఉన్న కార్యాలయాన్ని డివిజన్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయంగా మారుస్తూ కొత్త భవనంలో ఏర్పాటైన కార్యాలయాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పనితీరు మరింత మెరుగుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మల భాను, వైస్ ఎంపిపి వాకమూడి అనిల్, జాడ శ్రీధర్, నిమ్మక పాండు, వెన్నపు శ్రీనివాసరావు కొండదాడి రాజేష్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు స్వచ్ఛంద సేవలు అవసరం

ప్రజాశక్తి - కొమరాడ

మన్యం జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న సేవలు ప్రజలకు చాలా అవసరమని నాబార్డ్ డిడిఎం దినేష్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని మార్కొండపుట్టి గ్రామంలో హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్ఎఎల్‌పిజి సోలార్ లైట్లును బ్రెడ్స్ సంస్థ సహకారంతో గురువారం పంపిణీ చేశారు. మార్కొండపుట్టి, పరుశురాంపురం, కల్లికోట, విక్రాంపురం, రాజ్యలక్ష్మిపురం గ్రామాలకు చెందిన 250 కుటుంబాలకు సోలార్ లైట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థలు ద్వారా ప్రజలకు పలు సేవా కార్యక్రమాలతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్య పరచడం చాలా సంతోషకరమని అన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజలకు అవసరమైన వస్తువులు అందజేసి వాటిని వినియోగించుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించడం చాలా గొప్ప విషయం అన్నారు. అనాథలకు భోజనం అందించడం, కుట్టుమిషన్లు ఇలా అనేక రంగాల్లో సేవలు అందిస్తూ ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేయడం ఆనందదాయకం అన్నారు. భవిష్యత్తులో హెల్ప్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ జనరల్ సెక్రటరీ ధనుంజయ నాయుడు, బ్రేడ్స్ సంస్థ సిఇఒ రామకృష్ణ రాజు, రైతు నేస్తం ఎఫ్‌టిఒ సిఇఒ డి.శ్రీధర్, స్థానిక ప్రజాప్రతితులు మహిళలు పాల్గొన్నారు.



లైట్లను పంపిణీ చేస్తున్న నాబార్డు డిడిఎం

పార్టీ విధేయులకు గుర్తింపు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

పార్టీని నమ్ముకున్న ప్రతి నాయకుడ్ని, కార్యకర్తను అధిష్టానం గుర్తించి వారికి సముచిత స్థానాలు కల్పించడం జరుగుతుందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని మరిపి వలస పిఎసిఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొ న్నారు. చైర్మన్‌గా జక్కు ఫకీరునాయుడు, డైరెక్టర్లుగా మర్రాపు యోగేశ్వరరావు, శనపతి రాజుపాత్రుడుతో ప్రమాణ స్వీకారం చేయిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి సీనియర్ నాయకునికి వివిధ రకాల పదవులు అప్పగిస్తుందన్నారు.టిడిపిని భుజాలపై వేసుకొని అహర్నిశలూ పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నాయకులకు అధిక ప్రాధాన్యత కల్పించి వారికి ఇటువంటి పదవులను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు నిరంతరం సైనికు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పెంట సత్యంనాయుడు, నాయకులు రౌతు వేణుగోపాలనాయుడు, దామినేని పెద్దబ్బాయి, మాజీ జడ్పిటిసి తెంటు వెంకటప్పలనాయుడు, డిసిసిబి మాజీ డైరెక్టర్ బొంగు చిట్టిరాజు, వైస్ ఎంపిపి సూర్యనారాయణ, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చైర్మన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బోనెల



పిఎసిఎస్ కార్యాలయం

సిబ్బందికి ఏదీ 'సహకారం'

జీతాలందక ఇబ్బందులు

ప్రజాశక్తి- బలిజిపేట

మండల కేంద్రంలో ఉన్న పాలగర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పని చేస్తున్న ఆరుగురు సభ్యులకు సకాలంలో జీతాలు చెల్లింకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఆరుగురులో సర్వీసు రికార్డులున్న సరినాయుడు, హైమ, కిరణ్ కుమార్‌లకు హెచ్‌ఆర్‌సీ పాలసీ ప్రకారం రూ.40వేలు, రూ.31వేలు, రూ.21వేలు ప్రతి నెలా జీతం ఇచ్చేవారు. ఈ జీతాలు 2024 జనవరి ఒకటి నుంచి 2025 ఏప్రిల్ 30వ తేదీ వరకూ సక్రమంగానే ఇచ్చారు. మే నెల నుండి ప్రస్తుతం డిసెంబర్ వరకు జీతాలు ఇవ్వలేదని జీతాలు ఇవ్వమని అడిగితే పై అధికారులు హెచ్‌ఆర్‌సి ప్రకారం జీతం ఇవ్వలేమని పాత జీతాల వరకు ఇవ్వగలమని చెబుతున్నారని సిబ్బంది వాపోతున్నారు. హెచ్‌ఆర్‌సి ప్రకారం తమకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గలవెల్లి ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలోనూ ఇదే విధంగా జీతాలు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని వారు చెబుతున్నారు. పాత జీతాలు రూ.21వేలు, రూ.19వేలు, రూ.16వేలు తీసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని అయినా తాము తీసుకోకపోవడంతో ఇప్పుడు ఏడు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వలేదని, దీంతో ఇబ్బంది పడుతున్నామని వారంతా వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మెగా పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించాలి : డిఐఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 5న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని డిఐఇఒ వై.నాగేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక కళాశాలను సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యేలా చూడాలన్నారు. కళాశాలలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రారంభ దశ నుంచి ముగింపు వరకు సక్రమంగా నిర్వహించి జిల్లాలోని అన్ని కళాశాలల కంటే వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించారు. అలాగే విద్యార్థుల, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఆయనతో పాటు ప్రిన్సిపల్ డిజిఎస్‌వి త్రినాధ, ఉన్నారు.

సిఎం కార్యక్రమానికి పాఠశాల ఎంపిక

సీతంపేట: మెగా పేరెంట్స్ డే కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రానున్న సందర్భంగా మండలంలోని దాసుగుమ్మడలో గల ఎంపిపి స్కూల్ హెచ్ఎం జిల్లా ఎఫ్ ఎల్ ఎన్ రిసోర్స్ పర్సన్ శీల గణేష్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో ఎఫ్ఎల్ఎం తెలుగు భాష గణితం పై పునాది అభ్యసనపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరిస్తారు. అదేవిధంగా రాష్ట్రంలో 26వేల పాఠశాలలకు ఎఫ్ఎల్ఎం ఇచ్చినట్లు తెలుపుతారు. అదేవిధంగా అక్షరమాల చార్టులు, కథలు, ఫజిల్స్ తదితర అంశాలు ఉండడంతో విద్యార్థులకు సులభంగా ఆటపాటలతో పాఠాలు ఈ కిట్టు ద్వారా బోధించవచ్చని వివరించినట్లు ఉపాధ్యాయులు గణేష్ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని శ్యామల గౌరీపురం గ్రామ సమీపాన జాతీయ రహదారి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి మక్కువ మండలం కవిరిపల్లికి చెందిన అలమండ వినోద్ కుమార్ (35) మృతి చెందాడు. పాచిపెంటకు చెందిన గెద్ద నూకరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన నూకరాజును చికిత్స నిమిత్తం సాలూరు సిహెచ్‌సిలో చేర్పించారు. పోలీసుల అందించిన వివరాల ప్రకారం మక్కువ మండలం కవిరిపల్లికి చెందిన అలమండ వినోద్ కుమార్ అత్తగారి గ్రామమైన చెరుకుపల్లి బతుకుతెరువు కోసం వచ్చి మూడేళ్ల క్రితం నుంచి నివాసం ఉంటున్నాడు. వినోద్ కుమార్ కొట్టక్కి వద్ద ఉన్న డీజే దాబాలో పనిచేస్తున్నాడు. ప్రతిరోజులాగే చెరుకుపల్లి నుంచి కొట్టక్కి దాబాకు గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా శ్యామల గౌరీపురం సమీపంలో జాతీయ రహదారి వద్ద సాలూరు నుంచి పాచిపెంట వైపు వస్తున్న బొలెరో వ్యాన్ అతివ్యాగంగా వచ్చి వినోద్‌కుమార్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో వినోద్ కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. బొలెరో వ్యాన్ డ్రైవర్ నూకరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు వినోద్ కుమార్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. హెచ్‌సి సమర్పణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

135లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని ఎంఆర్ నగరం సమీపాన ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో 135 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సిఐ శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో ఎంఆర్ నగరానికి చెందిన ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఆయన నుంచి ఒక సెల్ ఫోన్ కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


6న వాహనాల వేలం

ప్రజాశక్తి - పార్వతీపురం

సర్కిల్ పరిధిలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు ఈనెల 6న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సిఐ శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు వేలంపాటలో పాల్గొనే వ్యక్తులు సర్కిల్ కార్యాలయానికి హాజరు కావాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

ఎంపిపి ఇంట విషాదం

ప్రజాశక్తి- బలిజిపేట



మండలంలోని పెదపెంకి గ్రామానికి చెందిన ఎంపిపి గుడివాడ నాగమణి అత్త గుడివాడ పైడితల్లి(67) గురువారం మృతి చెందారు. ఆమె గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విజయనగరం మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈమెకు జగన్, కళావతి, రామారావు, హరినాథ్ పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పైడితల్లి పార్థివ దేహానికి నివాళులు అర్పించి ఎంపిపి భర్త గుడివాడ జగన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అలజంగి రవికుమార్, వైస్ ఎంపిపి వెలిది సాయిరాం, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు పాలవలస మురళీ కృష్ణ, నూకలవాడ గ్రామ సర్పంచ్ కురిటి వెంకటరమణ, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొని సంతాపం తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

సీతంపేట: గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు డిమాండ్ చేశారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయం వద్ద ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాలకు రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు. మండలంలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో పూర్తి స్థాయి సిబ్బంది నియమించి, రైతులకు సంబంధించిన విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కూరంగి జగదీష్ తదితరులు ఉన్నారు.